# ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తా



చేర్యాల పట్టణంలోని వీరభద్ర సినిమా టాకీస్ వద్ద లెమన్ టీ తాగుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాలలోని పాత బస్టాండ్ సెలూన్‌లో షేవింగ్ చేయించుకుంటున్న పల్లా

- సేవ చేసేందుకు వచ్చా.. ఆశీర్వదించండి
- బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- చేర్యాల మున్సిపల్ పరిధిలో జోరుగా ప్రచారం
- పెద్ద ఎత్తున పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

చేర్యాల, నవంబర్ 19 : జనగామ నియోజకవర్గంలోని ప్రజలకు తన నీలిమా దవాఖానలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తానని, ప్రజా సేవ చేసేందుకు వచ్చానని, తనను ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రజలను కోరారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి రోజురోజుకూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆదివారం పల్లా చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు బీడీ కాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం చేర్యాల పాత బస్టాండ్ వద్ద ఓ సెలూన్‌కు సామాన్య వ్యక్తిగా వెళ్లి షేవింగ్ చేయించుకున్నారు. అనంతరం వీరభద్ర సినిమా టాకీస్ ప్రదేశంలోని రోడ్డు పక్కనే ఉన్న ఓ చాయ్ దుకాణం వద్దకు వెళ్లి ప్రజలు, దుకాణాదారులతో కలిసి లెమన్ టీ తాగారు. ఈ సందర్భంగా షాపుల యాజమానులను కలిసి బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలని కోరారు. రానున్న ఎన్నికల్లో తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బీడీ కాలనీలో జరిగిన ప్రచారంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజల కోసం బ్రహ్మాండమైన మ్యానిఫెస్టో తయారు చేశారని, ప్రజలు దీవిస్తే వాటిని అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు చెబుతున్న మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అధికారంలోకి రాకముందే రాచకొండ భూములను అమ్ముతామని రేవంత్‌రెడ్డి అంటున్నాడని, వారిని నమ్మితే అధోగతి తప్పదని హెచ్చరించారు. ఎన్నికలు రాగానే అమలుకు సాధ్యం కానీ హామీలిచ్చి.. ఎన్నికలు ముగియగానే మాయమైపోయే వ్యక్తిని కాదన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. గ్రామాలభివృద్ధి చేసే బాధ్యత నాదని, బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసే బాధ్యత ప్రజలదన్నారు. ఘటకేసర్‌లో ఉన్న తన వైద్య కళాశాల(నీలిమా)లో జనగామ నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తానని తెలిపారు. రేషన్‌కార్డు తీసుకుపోతే అక్కడ నియోజకవర్గ ప్రజలకు వైద్యసేవలు అందే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. నేను పక్కా లోకల్ వ్యక్తినని, కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న వ్యక్తి తాను స్థానికుడిని కాదని ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. చేర్యాల ప్రాంతానికి తీరని అన్యాయం చేసిన వ్యక్తిని ప్రజలు నమ్మొద్దన్నారు. నాలుగు పార్టీలు మారిన వ్యక్తితోనే చేర్యాల నియోజకవర్గం గల్లంతు అయ్యిందన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకంతో ప్రతి ఇంట మహిళకు నెలకు రూ.3 వేలు ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ అన్ని ఏర్పాట్లు చేశారని చెప్పా రు. ఇక దొడ్డు బియ్యం సరఫరా ఉండదని, సన్నబియ్యం రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణీశ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, బీఆర్‌ఎస్ టౌన్ ప్రధాన కార్యదర్శి పచ్చిమడ్ల సాయికిరణ్‌గౌడ్, నాయకులు గోనే హరి, వకులాభరణం నర్సయ్య పంతులు, ఆది శ్రీనివాస్, కూరపాటి మధు, బుడిగె గురువయ్యగౌడ్, నాగుల వెంకటేశ్, నాగమల్ల శ్రీనివాస్, ఎనిమల్ల శ్రీధర్, పరశురాములు, రాజు, సుభాష్, ముజ్జు, నరేశ్, వినయ్, మహేశ్, ప్రవీణ్, రాకేశ్ పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న నాయకులు

## పనిచేసే ప్రభుత్వానికే పట్టం కడదాం

కొమురవెల్లి, నవంబర్ 19 : పనిచేసే ప్రభుత్వానికే పట్టం కడదామని చేర్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెరుగు కృష్ణాగౌడ్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బూర్గు స్వామిగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఐనాపూర్‌లో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు దయ్యాల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని, మోసపోతే గోస పడతామన్నారు. తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్ బలపర్చి బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి గ్రామ కో-ఆర్డినేటర్ జయరాములు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, శ్రీకాంత్, అఫ్జల్, అంజి పాల్గొన్నారు.

## పింఛన్ ఇచ్చిన సారును మరువకు..

వర్గల్, నవంబర్ 19 : మండలంలోని మైలారం, మజీద్‌పల్లి తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ బాలమల్లు, ఎంపీపీ లతారమేశ్‌గౌడ్, ప్యాక్స్ చైర్మన్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందుతున్నవారితో ప్రతిపక్షాల పార్టీలకు చెందినవారితో నేరుగా కలిసి కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు నాగరాజు, మైనార్టీ సెల్ నాయకుడు సద్దాం హుస్సేన్, విద్యార్థి విభాగం నాయకుడు తాళ్లస్వామిగౌడ్ బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ గెలుపు కోరుతూ ర్యాలీ

గజ్వేల్ అర్బన్, నవంబర్ 19 : ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలవాలని కోరుతూ గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు వినూత్న ప్రచారం నిర్వహించారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని 1వ వార్డు కౌన్సిలర్ బొగ్గుల చందు, వార్డు అధ్యక్షుడు స్వామి, సోషల్ మీడియా నాయకులు కరీం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఫ్లెక్సీ పట్టుకుని వార్డులో ప్రచారం నిర్వహించారు. వరల్డ్ కప్‌లో ఇండియా గెలవాలి.. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలవాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.




ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## నేడు మంత్రి హరీశ్‌రావు రోడ్‌షో

గజ్వేల్, నవంబర్ 19 : గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని కొండపాక, గజ్వేల్, వర్గల్, ములుగు మండల కేంద్రాల్లో నేడు ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు రోడ్‌షో నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బెండె మధు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మంత్రి రోడ్డు షో నిర్వహిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్నిగ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రోడ్‌షోకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మల్లన్నను దర్శించుకున్న భక్తులు

చేర్యాల, నవంబర్ 19 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో నిండిపోయింది. స్వామివారి ఉత్సవాలు ముగిసినప్పటికీ పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొమురవెల్లి క్షేత్రానికి 10 వేల మంది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే భక్తులు కొమురవెల్లికి చేరుకొని స్వామివారిని దర్శించుకోవడంతోపాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపై ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతోపాటు మట్టి పాత్రలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మల్లన్న ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయం రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

# దేశానికే తెలంగాణ రోల్ మోడల్

**ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు**

సిద్దిపేట, నవంబర్ 19 : వ్యవసాయానికి 24 గంటల కరెంట్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, విద్యుత్ రంగంలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్ అని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌స్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూట్లో రాయి తీయలేనోడు.. ఏట్లోని రాయి తీస్తడు అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారం ఉందన్నారు. కర్ణాటక ఎన్నికల్లో తప్పుడు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. విద్యుత్ కోతలు విధిస్తుందన్నారు. తెలంగాణలో అన్నివర్గాల ప్రజల గురించి సీఎం కేసీఆర్ ఆలోచించారన్నారు. అన్నిరంగాల్లోరాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. సీఎం కేసీఆర్ తాగు, సాగు, కరెంట్ కష్టాలు తొలగించారన్నారు. ధాన్యం ఉత్పత్తిలో నేడు తెలంగాణ దేశంలోనే టాప్‌లో ఉందన్నారు. బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం సిద్దిపేట నియోజకవర్గం ఎల్లుపల్లి గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలకృష్ణ రెడ్డి, పుల్లూరు గ్రామానికి చెందిన రాష్ట్ర ఓబీసీ జనరల్ సెక్రటరీ ఉడుత మల్లేశం, బజరంగదళ్ జిల్లా అధ్యక్షుడు బయ్యారం కమలాకర్‌రెడ్డి, సిద్దిపేట మండల బీజేపీ సెక్రటరీ విజయ్, తీన్మార్ మల్లన్న టీమ్ జిల్లా కన్వీనర్ మోత్కు సాయికుమార్, పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు స్వప్న, పురుమాండ్ల వెంకట్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సామల్ల నరేందర్‌రెడ్డి తదితరులు మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

# కేసీఆర్ సభతో బీఆర్‌ఎస్‌లో నూతనోత్సాహం

- ప్రజా ఆశీర్వాద సభకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- గులాబీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం
- సీఎం సభకు తరలివచ్చిన ప్రజలకు పల్లా కృతజ్ఞతలు



చేర్యాల ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ (ఫైల్)

చేర్యాల, నవంబర్ 19 : చేర్యాల పట్టణంలో శనివారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్‌లో నూతనోత్సాహం నెలకొంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం సీఎం హోదాలో చేర్యాల రావడం ఇదే మొదటిసారి కావడంతో ప్రజలు కేసీఆర్ ప్రసంగం వినడానికి, ఆయన్ను నేరుగా చూసేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు. బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైతం తనదైన శైలీలో ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడం, దానికి అనుగుణంగా పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పని చేశారు. సీఎం కేసీఆర్ సభకు చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట, కొమురవెల్లి మండలాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. జనగామ, సిద్దిపేట జాతీయ రహదారిలో వీరన్నపేట నుంచి మొదలుకుని కొమురవెల్లి స్వాగత తోరణం వరకు నాలుగులైన్ల రోడ్డు మొత్తం ఇసుకేస్తే రాలనంత జనం ఉండడంతో ట్రాఫిక్ క్లియర్ కావడానికి గంటల సమయం పట్టింది. ఇటీవల ఎన్నడూలేని విధంగా ఎండ దంచికొట్టినప్పటికీ ప్రజలు దాన్ని లెక్క చేయకుండా ఓపెన్ ప్లేస్‌లో నిర్వహించిన సభకు గంట ముందే వచ్చారు. సీఎం కేసీఆర్ స్పీచ్ ముగిసిన తర్వాత ప్రజలు వారి గమ్యస్థానాలకు వెళ్లేందుకు రెండు గంటల సమయం పట్టింది. దీంతోపాటు బచన్నపేట, జనగామ, నర్మెట్ట, తరిగొప్పుల తదితర మండలాల నుంచి ముఖ్యకార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు భారీగా తరలివచ్చారు. సీఎం కేసీఆర్ సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో పల్లాకు పల్లెలు, పట్టణాలు జై కొడుతున్నాయని చేర్యాల పట్టణంలో పలువురు చర్చించుకుంటున్నారు.

### సభను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు



సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయంతం చేసిన ప్రజలకు, నాయకులు, కార్యకర్తలు ప్రతిఒక్కరికీ బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఉహించిన దాని కంటే ఎక్కువ మంది ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల వరకే తాను రాజకీయాలు చేస్తానని, ప్రజలకు సేవ చేయడానికి తాను ఇక్కడకి వచ్చానని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. సీఎం కేసీఆర్ సభ విజయవంతం కావడంలో పార్టీ శ్రేణుల కృషి ఎంతో ఉందన్నారు. ఇదే ఊపును కొనసాగించి బీఆర్‌ఎస్‌కు అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా కష్టపడి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.